# నమస్తే తెలంగాణ

## ములుగు

## జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, శుక్రవారం 17 జనవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




**అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులు** పండించిన ధాన్యానికి రూ. 500 బోసన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. తీరా అధికారంలోకి రాగానే మాట మార్చి సన్న వడ్లకే చెల్లిస్తామంది. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రోజులు గడుస్తున్నా వారి ఖాతాల్లో నగదు వేయకుండా తాత్సారం చేస్తున్నది. బోసన్ అంటేనే బోగస్ అనేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. దీనికి తోడు మానుకోట జిల్లాలోని పలు ఏజెన్సీ మండలాల్లో ఆర్వోలు ఇవ్వకపోవడంతో ధాన్యం విక్రయించినప్పటికీ నగదు జమకావడం లేదు. రైతులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా, డబ్బులు ఎప్పుడొస్తాయని ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పడం లేదు. పట్టింపులేకుండా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా కలెక్టర్ ఆదేశాలనూ బేఖాతర్ చేస్తున్నారు.

*- మహబూబాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ)*

## సన్న వడ్ల డబ్బులకు కాంగ్రెస్ సర్కారు ఎగనామం

- రోజుల తరబడి రైతుల ఖాతాల్లో జమకాని నగదు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో రూ. 85.24 కోట్ల బకాయి
- ధాన్యం విక్రయించిన డబ్బులదీ అదే పరిస్థితి
- పలు చోట్ల ఆర్వోలు ఇవ్వని పౌరసరఫరాల శాఖ
- పట్టింపులేకుండా వ్యవహరిస్తున్న అధికారులు

# బోనస్.. అంతా బోగస్



**ఉమ్మడి జిల్లా రైతులకు రావాల్సిన బోనస్**

| జిల్లా | రైతుల సంఖ్య | డబ్బులు (రూ. కోట్లలో) |
|---|---|---|
| హనుమకొండ | 657 | 32 |
| వరంగల్ | 14,019 | 32 |
| మహబూబాబాద్ | 11,820 | 26.75 |
| జనగామ | 1,717 | 3.06 |
| భూపాలపల్లి | 4,150 | 8.40 |
| ములుగు | 1,595 | 13.56 |
| మొత్తం | 33,958 | 85.24 |

### ధాన్యం డబ్బులు ఏవి?

మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 32,723 మంది రైతుల నుంచి రూ. 357.88 కోట్ల విలువ చేసే 1,54,343 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో ఇప్పటి వరకు 28,057 మంది రైతులకు సంబంధించిన 1,27,744 మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.296.17 కోట్లు ఖాతాల్లో జమ చేసింది. ఇంకా 4,666 రైతులకు చెందిన 26,599 మెట్రిక్ టన్ను ధాన్యానికి ఆర్వోలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో రూ.61.71 కోట్లకు సంబంధించిన లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి.

### ఏజెన్సీ మండలాల రైతులు ఆగమాగం..

మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, కొత్తగూడ, గంగారం ఏజెన్సీ మండలాల రైతులకు సమస్య మరీ ఎక్కువగా ఉంది. గార్ల మండలంలో గార్ల -1, గార్ల-2 కొనుగోలు కేంద్రాల్లో సుమారు 200 మంది రైతులు గత ఏడాది డిసెంబరు 22న వడ్లు విక్రయించారు. వీటికి సంబంధించిన ఆర్వోలు పౌరసరఫరాల శాఖ నుంచి రాకపోవడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు నయా పైసా పడలేదు. గతంలో బయ్యారం, గార్ల మండలాల్లో కలెక్టర్ స్వయంగా పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులు పౌరసరఫరాల శాఖ అధికారుల చుట్టూ రోజూ తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదు. గార్ల మండల కేంద్రంలోని పద్మావతి రైస్ మిల్లుకు మొదటిగా 30 వేల బస్తాలకు ఆర్వోలు విడుదల చేసిన అధికారులు డిసెంబర్ 22 నుంచి ఇప్పటి వరకు సుమారు మరో 30 వేల బస్తాలు దిగుమతి చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆర్వోలు ఇవ్వకపోవడంతో డబ్బులు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా కమిషనర్ వద్ద నుంచి ఆర్వోలు రావాలని చెప్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ క్వింటా వడ్లకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి కేవలం సన్నాలకే ఇస్తామంటూ మాట మార్చింది. ఇప్పటికే ధాన్యం అమ్మినప్పటికీ తమ ఖాతాల్లో నగదు జమకావడం లేదని రైతులు ఇబ్బందులు పడుతుండగా, బోసన్ డబ్బులు కూడా రాక మరింత ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు ధాన్యం అమ్మిన తర్వాత 48 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమయ్యేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 10 రోజుల నుంచి నెల రోజుల వ్యవధిలో డబ్బులు పడుతున్నాయి. ఇక బోనస్ ముచ్చట అడిగితే సమాధానం చెప్పే అధికారులు లేకుండా పోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్నాలకు సంబంధించిన బోనస్ డబ్బులు పెద్ద మొత్తంలో రైతులకు పడాల్సి ఉంది. మొత్తం 33,958 మంది రైతులకు రూ. 85.24 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.



### అధికారులు పట్టించుకోవడం లేదు

నేను పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన. గత డిసెంబర్ 22న కాంటా అయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆర్వోలు రాలేదని వడ్ల డబ్బులు ఖాతాలో వేయడం లేదు. పొలాలు కోసిన మిషన్ డబ్బులు ఇవ్వడానికి కూడా రైతుల వద్ద డబ్బులు లేవు. అధికారులు పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం రైతులకు శాపంగా మారింది.

*– ఆగాల రామారావు, రైతు, గార్ల*



### బోనస్ డబ్బులు రాలేదు

నాకు 10 ఎకరాల భూమి ఉంది. ధాన్యం డబ్బులు పడ్డాయి. కానీ బోనస్ డబ్బులు రాలేదు. గత నెల 15 నుంచి ఇప్పటివరకు రూపాయి కూడా పడలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇలా ఎప్పుడూ జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

*– కత్తి సత్యం, రైతు, గార్ల*

**ఉద్యాన పంటల సాగు రైతులకు** లాభాలు తెచ్చిపెడుతున్నది. దీంతో వరి సాగు తర్వాత అధిక శాతం ఈ పంటల వైపే మొగ్గు చూపుతూ ఆదాయం పొందుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 16,504 మంది రైతులు 25,700 ఎకరాల్లో వీటినే సాగు చేస్తున్నారు. అత్యధికంగా సుగంధ ద్రవ్యాలు, పండ్ల తోటలు, ఆయిల్ పాం తోటలపై మక్కువ కనబరుస్తున్నారు. దీర్ఘకాలిక పంటలు పండిస్తూ తక్కువ పెట్టుబడితో ఏళ్ల తరబడి రాబడి ఆర్జిస్తున్నారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలే మేలని నిరూపిస్తున్నారు.

*- జయశంకర్ భూపాలపల్లి, జనవరి 16 (నమస్తే తెలంగాణ)*



మొగుళ్లపల్లిలో ఆయిల్‌పాం తోట

# ఉద్యాన పంటలు.. లాభాల బాటలు

- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 25,700 ఎకరాల్లో సాగు
- అత్యధికంగా సుగంధ ద్రవ్యాలే
- 3649 ఎకరాల్లో ఆయిల్‌పాం.. 1045 ఎకరాల్లో పండ్ల తోటలు

జిల్లాలోని 12 మండలాల్లో 25,700 ఎకరాల్లో 16504 మంది రైతులు ఉద్యాన పంటలు పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. 1045 ఎకరాల్లో 667 మంది రైతులు పండ్ల తోటలు, 82 ఎకరాల్లో 162 మంది రైతులు కూరగాయలు, 20,202 ఎకరాల్లో 13,918 రైతులు సుగంధ ద్రవ్యాలు, 50 ఎకరాల్లో 31 మంది రైతులు సెరికల్చర్, 640 ఎకరాల్లో 470 మంది రైతులు ఆగ్రోఫారెస్ట్, 29 ఎకరాల్లో 20 మంది రైతులు బోర్డర్ ప్లాంటేషన్, 3 ఎకరాల్లో ఏడుగురు రైతులు పూలతోటలు, 3649 ఎకరాల్లో 1229 మంది ఆయిల్‌పాం పంటలు సాగు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం సర్వే కొనసాగుతుందని, ఈ పంటల విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.

### ఆరుతడి పంటలతో లాభాలు

రేగొండ, చిట్యాల, భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, మల్హర్ మండలాల్లో రైతులు కూరగాయల పంటలు సాగు చేస్తూ జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి విక్రయాలు జరుపుతూ మంచి ఆదాయం పొందుతున్నారు. జిల్లాలో మొత్తం 2021-22 నుండి 2024-25 వరకు 3,649.57 ఎకరాల్లో 1229 మంది రైతులు ఆయిల్‌పాం సాగు చేశారు. ఇందులో మొదటి విడ తగా 2021-22లో 112 మంది రైతులు 352.55 ఎకరాల్లో సాగు చేశారు. అలాగే 2022-23లో 609 మంది రైతులు 1877.53 ఎకరాల్లో, 2023-24లో 411 మంది రైతులు 1163.90 ఎకరాల్లో సాగు చేశారు. 2024-25 లో 97 మంది రైతులు 255.58 ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేశారు. అయితే ఆయిల్‌పాం నాలుగేళ్ల వరకు పంట చేతికి రాదు. కాగా నాలుగేళ్ల పాటు ఆయిల్‌పాంలో అంతర పంటలుగా కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలు సాగు చేసుకుంటూ రైతులు రెండు రకాలుగా ఆదాయం పొందుతున్నారు. ఆయిల్‌పాం పంట దిగుబడి ప్రారంభమైనా అంతర పంటలు వేసుకునే అవకాశం ఉంది.

### లాభసాటి పంట ఆయిల్ పాం

వరి, మిర్చి ఇతర పంటల్లాగ దీనికి భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన పని లేదు. ఒక్కసారి నాటి సస్యరక్షణ చర్యలు చేపట్టుకుంటూ పోతే 40 ఏళ్లకుపైగా దిగుబడి పొందవచ్చు. నేను మూడెకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటిన. అంతకు ముందు పెట్టుబడి పెట్టలేక భూమిని పడావు పెట్టిన. అధికారుల సూచన మేరకు ఆయిల్‌పాం సాగు మొదలు పెట్టిన క్రాప్ మొదలైంది. రైతులు వరికి, మిర్చికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పాంను ఎంచుకోవాలి. మార్కెట్‌లో ధర ఎంత తగ్గినా నష్టమైతే ఉండదు.



*– పువ్వాటి సత్యనారాయణరావు, గుంటూరుపల్లి, చిట్యాల మండలం*



రేగొండ మండలం రేపాకపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ తోట

# మిషన్ పంచాయితీ

- ఏడాదిగా కుట్టుమిషన్ల పంపిణీకి కలగని మోక్షం
- లబ్ధిదారుల జాబితాను మార్చిన కాంగ్రెస్ నాయకులు
- పాత, కొత్త లిస్టుతో మిన్నకుండిన అధికార యంత్రాంగం

గణపురం, జనవరి 16: మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉచితంగా అందించే కుట్టుమిషన్ల పంపిణీకి రాజకీయ రంగు పులుముకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు లబ్ధిదారుల జాబితాను మార్చారు. దీంతో అధికారులు తమకెందుకులే ఈ పంచాయితీ అనుకొని మిన్నకుండిపోయారు. మహిళలు స్వశక్తితో ఎదగాలన్న లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కలెక్టర్ నిధులతో వారికి కుట్టుమిషన్ శిక్షణ ఇప్పించి, ఉచితంగా మిషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు మేజర్ గ్రామపంచాయతీల్లో 45-69 చొప్పున, చిన్న జీపీల్లో 10-20 చొప్పున అందించాలనుకున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర సుమారు 50 కుట్టుమిషన్లు తెప్పించి చెల్పూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉంచారు. గ్రామస్తుల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. పంపిణీ చేద్దామనుకునే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది. ఈలోగా ప్రభుత్వం మారడంతో కుట్టుమిషన్ల పంపిణీ అటకెక్కింది.

**పాత లిస్టు తారుమారు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో ఎంపికైన లబ్ధిదారులను తీసివేసి, ఆ పార్టీ నాయకులు తమకిష్టం వచ్చిన పేర్లతో కొత్త లిస్టును తయారు చేశారు. కుట్టుమిషన్లు తుప్పు పడుతున్నా అధికారులు మాకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అర్హులకు మిషన్లు పంపిణీ చేయాలని ఏడాదిగా శిక్షణ పొందిన మహిళలు కోరుతున్నారు.

### పాత లిస్టు ప్రకారమే ఇవ్వాలి



మాలాంటి గరీబోళ్ల పరిస్థితి చూసి వెంకటరమణా రెడ్డి సారు మాకు కుట్టుశిక్షణ ఇప్పిచ్చిండు. మాకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తనన్నడు. ఇంతలోనే ఎలక్షన్ కోడ్ వచ్చి ఇయ్యలేకపోయిండు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటినా ఒక్క మిషన్ కూడా పంపిణీ చేయలే. అధికారులను అడిగితే సడీ చప్పుడులేదు. కాంగ్రెసోళ్లు గింత పక్షపాతం చూపిస్తరనుకోలే. మాకు అన్యాయం చేస్తే ఊరుకోం. పాత లిస్టు ప్రకారమే కుట్టుమిషన్లు పంపిణీ చేయాలి.

*– బూరం మాధవి, లబ్ధిదారు, చెల్పూర్*



చెల్పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిల్వ ఉన్న కుట్టుమిషన్లు



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఈడీ విచారిస్తున్న సందర్భంగా ఆ సంస్థ కార్యాలయం ఎదుట వేచి చూస్తున్న మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్

# చారిత్రక ఖిల్లా.. నిర్లక్ష్యం నిలువెల్లా

- కాకతీయ కట్టడాలకు తాళాలు
- వీక్షించకుండానే పర్యాటకులు తిరుగుముఖం
- కేంద్ర పురావస్తు శాఖ తీరుపై అసహనం

చారిత్రక ఖిల్లాలో కేంద్ర పురావస్తు శాఖ నిర్లక్ష్యం నిలువెల్లా కనిపిస్తున్నది. కాకతీయుల కళా వైభవాన్ని వీక్షించకుండా కట్టడాలకు ఏండ్ల తరబడి తాళాలు వేయడంపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఇక్కడి అద్భుత శిల్ప కళ నేటికీ మరెన్నో తరాలకు కనువిందు చేస్తూనే ఉంటుంది. పర్యా టకుల ఆనందానికి పరిశీలకుల అంచనాలకు భిన్నంగా చారిత్రక ప్రాశస్త్యం వెలకట్టలేనిది. అలాంటి విశ్వవ్యాప్తమైన కోటలోని ఆలయాలు, చారిత్రక కట్టడాలను పరిరక్షణ పేరుతో కేంద్ర పురావస్తు శాఖ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసింది. గేట్లు ఏర్పాటు చేసి వాటికి తాళాలు వేయడంపై పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

*– ఖిలావరంగల్, జనవరి 16*



తాళం వేసి ఉన్న కొండగుడి

కోటలోని కాకతీయుల శిల్ప కళా సంపదను ప్రత్యక్షంగా వీక్షించి అనుభూతి పొందేందుకు దూరతీర ప్రాంతాల నుంచి పర్యాటకులు వేల సంఖ్యలో వస్తుంటారు. వారికి ఏ కట్టడం ఎక్కడ ఉందో తెలియక ఆందోళన చెందుతుంటారు. అతికష్టం మీద స్థానికుల ద్వారా ఆలయాలు, ఇతర కట్టడాల దారి తెలుసుకొని వెళ్లే సరికి అక్కడ లోనికి వెళ్లకుండా తాళాలు వెక్కిరిస్తుంటాయి. దీంతో పర్యాటకులు పురావస్తు శాఖపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీక్షించకుండానే వెనుతిరుగుతుంటారు. గుళ్లు, గోపురాలు.. నిర్మాణ సౌధాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్న నేపథ్యంలో వాటికి తాళాలు వేయడంపై పర్యాటకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటలో పదుల సంఖ్యలో చారిత్రక సౌధాలు ఉన్నా కేవలం కీర్తితోరణాల మధ్య ఉన్న శిల్ప సంపద, ఖుష్‌మహల్, ఏకశిలగుట్ట అనే పరిస్థితికి కేంద్రపురావస్తుశాఖ తీసుకువచ్చిందనే విమర్శలున్నా యి. ప్రస్తుతం పెరుగుతున్న ప ర్యాటకులను దృష్టిలో పెట్టుకొని ప్రతి చారిత్రక కట్టడం వద్దకు సులువుగా వెళ్లేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆలయా లు, కట్టడాలకు వేసిన తాళాలను తీసి ప ర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

**తాళాలు వేసిన ఆలయాలు ఇవే..**

కోటలోని జంగమయ్య గుడి(మేడరాయుడిని ఆలయం), కొండ గుడి, నేలశంభుని ఆలయం, మండలమ్మ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, మందు గుండు సామగ్రి భద్రపరిచే గది నిర్మాణాలను బహు ముచ్చటేస్తుంటాయి. ఆగమ శాస్త్రం ప్రకారం అద్భుతంగా ఒక్కొక్క ప్రత్యేకతతో వీటి నిర్మాణం చేశారు.

# పండుగకు ఇంటికి వచ్చి వెళ్తూ..

- కారును లారీ ఢీకొట్టడంతో తల్లి, కూతురు మృతి
- మహబూబాబాద్ జిల్లాలో విషాదం

కేసముద్రం, జనవరి 16: పండుగకు ఇంటికి వచ్చి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు మృతి చెందిన ఘటన యాదాద్రి జిల్లా రాయగిరి వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నా యి.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం గాంధీపురం శివారు వెంకటాపురం తండాకు చెందిన భూక్యా సంతోష్-అనూష దంపతులు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవే ట్ కంపెనీలో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ప్రాణస్విని, చైత్ర ఉన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మూడు రోజుల క్రితం సంతోష్ కుటుంబంతో సహా హైదరాబాద్ నుంచి కారులో స్వగ్రామానికి వచ్చా డు. పండుగ అనంతరం గురువారం తెల్లవారుజామున చెల్లె భవాని, బావ రవి, భార్య, పిల్లలతో కలిసి కారులో తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో రాయగిరి వద్ద కారును లారీని ఢీకొట్టడంతో ముందు కూర్చున్న అనూష(34), చైత్ర(6)లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సంతోష్, భవాని, రవి, ప్రాణస్వినిలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తండాలో పండుగ పూట విషాదం నెలకొంది.



భూక్యా అనూష, చైత్ర(ఫైల్)

# ఆస్తిని కాజేసి.. ఇంటి నుంచి గెంటేసి

- తండ్రిపై కొడుకు దాష్టీకం
- దొడ్లగడ్డలో అమానవీయ ఘటన
- పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు

వర్ధన్నపేట, జనవరి 16: కంటికి రెప్పలా కాపాడుకున్న కొడుకే కసాయిగా మారాడు. ఆస్తి కాజేసి వృద్ధుడైన తండ్రిని బయటకు గెంటేశాడు. ఈ అమానవీయ ఘటన వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట శివారు దొడ్లగడ్డలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జుల రాజారెడ్డి(72) 33 ఏళ్ల క్రితం మైలారం గ్రామానికి చెందిన సుజాతను వివాహం చేసుకోగా, వీరికి ఒక కుమార్తెతో పాటు కొడుకు వినయ్‌రెడ్డి జన్మించారు. వివాహం జరిగిన ఐదేళ్ల తర్వాత సుజాతను ఒప్పించి ఇదే గ్రామానికి చెందిన యశోదను ప్రేమించి పెళ్లి చేసుకోగా ఆమెకు ఒక కుమార్తె జన్మించింది. ఇద్దరు భార్యలు, పిల్లలతో 25 ఏళ్లపాటు ఒకే ఇంట్లో సంతోషంగా ఉన్నారు. ఈక్రమంలో సుజాత కుమార్తె వివాహమైన తర్వాత, తల్లి సహకారంతో కొడుకు వినయ్‌రెడ్డి తండ్రిని చంపుతానని బెదిరించి, పథకం ప్రకారం రాజారెడ్డి చిన్నభార్య, కుమార్తెకు తెలియకుండా 15 ఎకరాల భూమిని తన పేరు మీదకు మార్చుకున్నాడు. అనంతరం 2022 సంవత్సరంలో రాజారెడ్డి, ఆయన రెండో భార్య, కుమార్తె, తల్లి వనమ్మను ఇంటి నుంచి బయటకు వెళ్ల గొట్టాడు. రెండు నెలల క్రితం వనమ్మ మృతి చెందినా ఇంట్లోకి రానివ్వకపోవడంతో మృతదేహాన్ని ఇంటి బయటే వేసి దహన సంస్కారాలు నిర్వహించారు. తనకు తన భార్య, కుమార్తెకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం రాజారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే కుమారుడి భూమి రిజిస్ట్రేషన్ పట్టాను రద్దు చేయాలని కోరుతూ ఇటీవల ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తు చేసినట్లు వివరించారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గుజ్జుల రాజారెడ్డి